నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 28 జూలై 2024 | YADADRI BHUVANAGIRI

పాఠశాలకు రాని ముగ్గురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

● మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు

సూర్యాపేట, జూలై 27 : అనుమతి లేకుండా పాఠశాలకు హాజరు కాని ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు అందించారు. చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరి గ్రామంలో కలెక్టర్ శనివారం ఉదయం ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్.. ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలకు రాని స్కూల్ అసిస్టెంట్ ఎం.నాగమణిని సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు పి.జానకి, ఆర్.వెంకటయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో గతంలో డీఈఓ అశోక్ తనిఖీ చేసిన సమయంలో అనుమతి లేకుండా పాఠశాలకు డుమ్మా కొట్టిన ఎస్జీటీ ఉపాధ్యాయులు పి.సత్యమూర్తి (నానుతండా) టి.వెంకటరాములు (బండరామారం)ను కూడా సస్పెండ్ చేశారు.

హైకోర్టు న్యాయమూర్తులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

యాదగిరీశుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

యాదగిరిగుట్ట, జూలై 27 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారిని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ వి.వేణుగోపాల్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.వినోద్‌కుమార్, కె.లక్ష్మణ్, కె.సుజన, జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎ.జయరాజు దర్శించుకున్నారు. పట్టణంలో జూనియర్ సివిల్ కోర్టును ప్రారంభించేందుకు శనివారం వచ్చిన వారు స్వయంభూ పంచనారసింహస్వామి దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

వారికి అర్చకులు ఆలయ సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. దర్శనానంతరం ముఖ మండపంలో వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ భాస్కర్‌రావు న్యాయమూర్తులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి, ప్రసాదం అందజేశారు.

చిక్కుల్లో చేనేత

ఉమ్మడి నల్లగొండలో మళ్లీ పాత రోజులు

భూదాన్ పోచంపల్లిలో పేరుకుపోయిన చేనేత చీరెలు

ఉమ్మడి రాష్ట్రంలో నేతన్నల బతుకులు అస్తవ్యస్తంగా ఉండేవి. సర్కారు తోడ్పాటు లేక వారి కుటుంబ పరిస్థితి దుర్భరంగా మారి జీవితం వెళ్లదీయడమే కష్టంగా ఉండేది. పనిలేక, ఉపాధి కరువై అప్పులపాలయ్యేవారు. తెచ్చిన అప్పులు, మిత్తీలు కట్టలేక అనేక మంది ఆత్మహత్యకు పాల్పడిన దుస్థితి. కానీ.. స్వరాష్ట్రంలో నేతన్నల బతుకులు మారాయి. కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో నేతన్నలకు కష్టాలు మొదలయ్యాయి. రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చేనేత పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుపోతున్నది. నేతన్నలు ఆర్థికంగా చితికిపోతున్నారు. సర్కారు ఆదుకోవడం మరిచి ఉన్న పథకాలను కూడా అమలు చేయడం లేదని నేత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, జూలై 27 (నమస్తే తెలంగాణ)

- పడిపోయిన అమ్మకాలు.. పేరుకుపోతున్న వస్త్ర నిల్వలు
- ప్రింటెడ్ కాపీ వస్త్రాలతో పరిశ్రమ ఆగమాగం
- నేతన్నను గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కారు
- కేసీఆర్ తెచ్చిన పథకాలు అమలు చేయట్లే
- 'చేనేత మిత్ర'కు మంగళం.. నెలకు రూ.3వేల సాయం బంద్
- 11 నెలలుగా 'థ్రిఫ్ట్' చెల్లింపులు పెండింగ్
- కలగా మారిన పోచంపల్లికి ఐఐహెచ్‌టీ
- కేంద్రం జీఎస్టీ మోతతో మరింత అవస్థలు

చేనేత కార్మికులు అనాదిగా వస్తున్న సంప్రదాయ పద్ధతులను నమ్ముకొని మగ్గాలపై చీరెలు, చేనేత వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారు. పెద్ద ఎత్తున వస్త్ర వ్యాపారం, తయారీ రంగం ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 20వేల మంది చేనేత కార్మికులు ఉంటారు. భూదాన్ పోచంపల్లి, గట్టుప్పల్, పుట్టపాక, సంస్థాన్ నారాయణపురం, భువనగిరి, కొయ్యలగూడెం, చండూరు, మునుగోడు తదితర ప్రాంతాల నుంచి చీరెలు అధికంగా ఉత్పత్తి చేస్తారు.

దొరుకని ఉపాధి.. సకాలంలో అందని కూలి

పట్టు చీరెలు అంతంత మాత్రంగానే అమ్ముడుపోతుండటం, టెస్కో సరిగా కొనకపోవడంతో నేతలన్నకు ఇబ్బందులు తప్పడం లేదు. చేనేత కార్మికులు మాస్టర్ వీవర్స్ వద్ద కూలికి మగ్గాలు నేస్తుంటారు. అయితే.. వస్త్ర నిల్వలు పేరుకుపోవడంతో ఉత్పత్తికి ముందుకు రావడం లేదు. దీంతో షావుకార్లు నేతన్నలకు పెద్దగా పని ఇవ్వడంలేదు. కొందరు పని కల్పిస్తున్నా కూలి డబ్బులు మాత్రం ఆలస్యంగా ఇస్తున్నారు. దాంతో నేత కార్మికులకు పూట గడవడం కష్టంగా మారుతున్నది. మరోవైపు గిరాకీ లేకపోవడంతో కొందరు తక్కువ ధరలకే చీరెలను అమ్ముకుంటున్నారు. సాధారణంగా రూ.10వేలకు అమ్ముకునే చీరెను రూ.7వేల నుంచి రూ.8వేలకు విక్రయిస్తున్నారు.

మర మగ్గాలదీ అదే పరిస్థితి..

చేనేతతోపాటు పవర్‌లూమ్స్ కూడా దీనస్థితికి చేరుకుంది. ముడి సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. ఇక్కడ తయారయ్యే పట్టు వస్త్రాలతోపాటు పంచెలు, టవళ్లు, లుంగీలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో పనిలేక స్థానికంగా ఉన్న పవర్‌లూమ్ పరిశ్రమలు మూతబడే పరిస్థితికి చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఆలేరు, పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, మోత్కూరు, నల్లగొండ, నకిరేకల్ తదితర మండలాల్లో పవర్‌లూమ్స్‌లు ఉన్నాయి.

టెస్కో నిర్వాకం.. వార్పునకు ఐదారు వేల నష్టం

ప్రభుత్వం, టెస్కో నిర్వాకంతో చేనేత రంగం ఆగమవుతున్నది. వస్త్ర పరిశ్రమ ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నది. చేనేత కార్మికులు కష్టాలపాలవుతున్నారు. చేనేత పట్టు చీరెల నిల్వలు ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోతున్నాయి. ఎప్పటికప్పుడు కొనాల్సిన టెస్కో కనీసం పట్టించుకోవడంలేదు. వస్త్ర నిల్వలు రూ.కోట్లల్లో పేరుకుపోవడంతో గిరాకీ లేక కార్మికులకు పని దొరుకడంలేదు. చేసిన పనికి షావుకార్లు కూలి డబ్బులు సకాలంలో ఇవ్వకపోవడంతో నేతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కొనుగోళ్లు ప్రారంభించినా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నది. ఒక్కో చీరెపై రూ.800 తక్కువగా కొంటున్నట్లు వీవర్లు చెబుతున్నారు. దీంతో ఒక్కో వార్పునకు ఐదారు వేల రూపాయల నష్టం వాటిల్లుతున్నది.

ఇక్కత్ వస్త్రాలు కాపీ..

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి చేనేత టై అండ్ డై ఇక్కత్ పట్టు చీరెల డిజైన్లకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. పేటెంట్ హక్కు కలిగిన పోచంపల్లి చేనేత ఇక్కత్ పట్టు చీరెల డిజైన్లు కాపీకి గురవుతున్నాయి. భౌగోళిక గుర్తింపు జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్ ట్యాగ్ కలిగిన పోచంపల్లికి ఇక్కత్ డిజైన్లను కొందరు బడా వ్యాపారులు కాపీ కొట్టి.. పవర్ లూమ్‌లపై ప్రింటెడ్ పాలిస్టర్ చీరెలను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇవి మార్కెట్‌లో అతి తక్కువ ధరకే లభిస్తున్నాయి. దీంతో పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరెలకు మార్కెట్ తగ్గడం ఆందోళన కలిగిస్తున్నది.

'త్రిఫ్ట్' చెల్లింపులు పెండింగ్

నేతన్నలకు సామాజిక భద్రత కల్పించడం కోసం కేసీఆర్ సర్కారు చేనేత చేయూత పథకాన్ని తీసుకొచ్చింది. నేత కార్మికుల నెలసరి చేనేత ఆదాయంలో ఎనిమిది శాతం ఆర్డీ1లో జమ చేసిన తర్వాత.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీ2లో 15శాతాన్ని నేరుగా జమ చేయాలి. ఆ మొత్తం నగదును వడ్డీతో సహా మూడేండ్ల తర్వాత కార్మికులకు అందుతుంది. ప్రస్తుత 2021-2024 సంవత్సరానికిగాను యాదాద్రి జిల్లాలో 11వేల మంది కార్మికులు నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక డబ్బులు జమ చేయడమే మరిచిపోయింది. సెప్టెంబర్ నుంచి 11 నెలలుగా డబ్బులు చెల్లించకపోవడంతో సుమారు రూ.25 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. మరోవైపు కార్మికులు మాత్రం తమ వాటాను తంచనుగా కడుతున్నారు.

కేంద్రం జీఎస్టీ మోత

చేనేత రంగాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదుకోకపోగా.. జీఎస్టీ పన్నుల మోతతో నేతన్నల నడ్డి విరుస్తున్నది. కేంద్రం నూలుపై 12శాతం, రసాయనాలపై 18 శాతం జీఎస్టీ విధిస్తుండడంతో డబ్బులు ఎక్కువ పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తున్నది. మరోవైపు నేతన్నలు ధరలు పెంచితే కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. ఒకప్పుడు చేతినిండా పని దొరుకగా.. ఇప్పుడు పని దొరుకుడే గగనంగా మారింది.

మళ్లీ వలస బాట..

బీఆర్ఎస్ హయాంలో నేతన్నలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు సమర్థంగా అమలయ్యాయి. పింఛన్లు, పావలా వడ్డీ, వివిధ రకాల స్కీమ్‌లు, రుణమాఫీ తదితర అనేక కార్యక్రమాలను అమలు చేసింది. నేతన్నకు నేనున్నానంటూ ధైర్యాన్నిచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో తట్టాబుట్టా చేతబట్టుకుని వలస బాట పట్టగా.. కేసీఆర్ పాలనలో అదే కార్మికులు సొంతూర్లలో చేతినిండా పనిదొరుకడంతో సంతోషంగా బతికారు. కానీ.. ఇప్పుడు పని దొరక్కపోవడంతో మళ్లీ వలసబాట పడుతున్నారు. హైదరాబాద్‌లో చిన్న చిన్న పనులతోపాటు ఇతర రాష్ట్రాలకు పయనం అవుతున్నారు. ఇంకొందరు స్థానికంగా ఇతర కూలి పనులు చేసుకుంటున్నారు.

చేనేత మిత్రకు సాయం బంద్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికులకు సంబంధించిన పథకాలకు ఒక్కొక్కటిగా పాతర వేస్తున్నది. నేతన్నల కోసం బీఆర్ఎస్ సర్కారు తీసుకొచ్చిన చేనేత మిత్ర పథకానికి మంగళం పాడింది. నేత కుటుంబానికి నెలకు రూ.3వేలు చెల్లించకుండా అటకెక్కించింది. గతంలో చేనేత మిత్ర పథకం కింద ప్రభుత్వం నూలు, రసాయనాలు, ముడి సరుకులకు సబ్సిడీ ఇచ్చేది. నూలు, సిల్క్, ఉన్ని, డై, రసాయనాల కొనుగోలుపై 40శాతం సబ్సిడీ కల్పించేది. అయితే సబ్సిడీ పొందడం నేతన్నలకు ఇబ్బందిగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన నేతన్నలకు నెలకు రూ.30వేల సాయం అందించాలని నిర్ణయించింది. కార్మికుల కుటుంబాలకే నేరుగా డబ్బులు జమ చేసింది. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క పైసా కూడా చెల్లించలేదు. పథకాన్ని బంద్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

పోచంపల్లికి ఐఐహెచ్‌టీ కలేనా!

భూదాన్ పోచంపల్లిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఏర్పాటు కలగానే మారుతున్నది. ఎన్నో వినతులు, విజ్ఞప్తుల తర్వాత తాజాగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ మంజూరు చేసింది. ఇన్‌స్టిట్యూట్ ఎక్కడ ఏర్పాటు చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఇప్పటికే పోచంపల్లి చీరెలు, ఇక్కత్ వస్త్రాలకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. పోచంపల్లి మండలంలోని కనుముక్కుల పరిధిలో ఉన్న హ్యాండ్లూమ్ పార్క్‌లో భవనాలు అందుబాటులో ఉన్నాయి. ఇది 23 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఐఐహెచ్‌టీ ఏర్పాటైతే అనేక విధాలుగా మేలు జరుగుతుంది. పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఐఐహెచ్‌టీ రాకపోగా, ఇక్కడే ఉన్న హ్యాండ్లూమ్ పార్కును కూడా తెరువడంలేదు.

ప్రభుత్వం చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలి

మార్కెట్లో వస్త్రాల కొనుగోలు తగ్గిపోవడంతో ఉత్పత్తిదారులు వస్త్రాలు నేయడం బంద్ చేశారు. దీంతో కార్మికులకు పని దొరుకక ఆర్థిక ఇబ్బందులతో వలసలు వెళ్లే దుస్థితి నెలకొంది. చేనేత సహకార సంఘం, సహకారేతర రంగాల్లో నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేసి నేత కార్మికులకు పూర్తిస్థాయిలో పని కల్పించి ఆదుకోవాలి. పోచంపల్లి ఇక్కత్ డిజైన్లను ప్రింటింగ్ చేస్తున్న మిల్లుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలి. చేనేత డిజైన్లను కాపీ కొట్టకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చర్యలు చేపట్టాలి. దుకాణదారులు, చేనేత కార్మికులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసి ఆదుకోవాలి.

- భారత లవకుమార్, పోచంపల్లి టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు

చేనేతపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తలేడు

నేను 50 సంవత్సరాల నుంచి మగ్గం నేస్తున్నా. లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న చేనేత వృత్తిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తలేడు. చేనేతపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుండు. రైతుల మాదిరిగా చేనేతకు ప్రాధాన్యత ఇస్తలేడు. చేనేత కార్మికులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలి. కార్మికులకు పని కల్పించి ఆదుకోవాలి. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి. పాలకవర్గాలు లేక సంఘం అభివృద్ధి కుంటుపడింది. పని లేక కార్మికులకు తిండి లేని పరిస్థితి ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కీమ్‌లను పునరుద్ధరించాలి. చేనేత సహకార సంఘంలోని వస్త్ర నిల్వలను కొనుగోలు చేసి కార్మికులకు పని కల్పించి ఆదుకోవాలి. బడ్జెట్‌లో చేనేతకు అధిక నిధులు కేటాయించాలి. చేనేత సమస్యలను ఎమ్మెల్యేలు, ఎంపీలు కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలి.

- దుద్యాల పాపయ్య, చేనేత సంఘం సభ్యుడు, భూదాన్ పోచంపల్లి

బతుకలేని పరిస్థితి

ప్రస్తుతం నేను చేనేత కూలి పని చేస్తున్న. చేనేత మీద ఆధారపడి బతుకుతున్న మాకు పెరుగుతున్న నిత్యావసర ధరలతో జీవనం కష్టంగా మారింది. గిరాకీ లేదాయే.. చీరెలు ఎవరూ కొంటలేరు. నేసిన చీరెలు దుకాణంలోనే ఉండె. సర్కారేమో మా గురించి పట్టించుకుంటలేదు. మాకు పని కల్పించి ఆదుకోవాలి.

- పగిడిమర్రి అంజమ్మ, చేనేత కార్మికురాలు, భూదాన్ పోచంపల్లి

చేనేత మిత్ర పథకం కొనసాగించాలి

చేనేత మిత్ర పథకం యథావిధిగా కొనసాగించాలి. 2017లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టి చేనేత బలోపేతానికి కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చేనేత మిత్ర పథకం ఆగిపోయింది. చేనేత మిత్ర పథకం ద్వారా మగ్గం నేసేవారికి నెలకు రూ.2400, కండెలు చుట్టేవారికి రూ.1600 ఇచ్చి గత ప్రభుత్వం ఆదుకున్నది. చేనేత రుణాలు, వర్క్‌షెడ్లు, చేనేత చేయూత, చేనేత పింఛన్, నేత కార్మికులకు పాత బకాయిలను ప్రభుత్వం విడుదల చేసి ఆదుకోవాలి.

- అంకం మల్లేశం, భక్త మార్కండేయ పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు (ఆలేరు రూరల్)

నేతన్నల గురించి నోరు ఎత్తడం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు నేతన్నల గురించి నోరు ఎత్తడం లేదు. గత ప్రభుత్వం త్రిఫ్ట్, చేనేత బీమా, నూలుపై 40శాతం రాయితీ ఇచ్చింది. ఇప్పుడు వాటి జాడ కానరావడం లేదు. 10 నెలల నుంచి త్రిఫ్ట్ పథకం ఆగిపోయింది. ఇంతకుముందు ప్రతి నెలా తప్పకుండా పడేది. మిగతా పథకాల పరిస్థితి కూడా అంతే. అన్ని రేట్లు పెరుగుతున్నా.. చేనేత వస్త్రాల రేటు మాత్రం పెరుగడం లేదు. పైగా రోజురోజుకూ తగ్గిపోతున్నది. ఇకనైనా ప్రభుత్వం మా గురించి పట్టించుకోవాలి. అగిపోయిన పథకాలను అమలు చేయాలి. లేకపోతే వృత్తి వదులుకొని కూలినాలికి పోవాల్సి వస్తది.

- బోగ కాశీరాములు, చేనేత కార్మికుడు, చౌటుప్పల్

చేనేత మిత్ర ఎందుకు అమలు చేస్తలేరు?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను నిలిపివేసింది. మేం నెల నెలా పొదుపు పథకానికి డబ్బులు చెల్లిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కట్టలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు నెలకు రూ.3వేలు ఇచ్చింది. ఇప్పుడు రావడంలేదు. చేనేత మిత్ర పథకాన్ని తప్పకుండా అమలు చేయాలి. లేకుంటే కాంగ్రెస్‌కు నేత కార్మికుల ఉసురు తగులుతుంది.

- కొంగరి సందీప్, చేనేత కార్మికుడు, గట్టుప్పల్

పూట గడవడం కష్టంగా ఉంది

నా భర్త చనిపోయి పది సంవత్సరాలైంది. నేను మగ్గం పనులు చేసి నా కుటుంబాన్ని చూసుకుంటున్నా. గతంలో త్రిఫ్ట్ పథకంలో ప్రతి నెలా రెండు వేలు కడితే రూ.4వేలు వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు లేకపోయినా అప్పు చేసి నెల నెలా రెండు వేలు కడుతున్నా. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రాలేదు. మగ్గం పనులు లేకపోవడంతో పూట గడవడం కూడా కష్టంగా ఉంది.

- అనసూయ, నేత కార్మికురాలు, నారాయణపురం

సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

● పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

● ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సూర్యాపేట కలెక్టరేట్ ముట్టడి

సూర్యాపేట, జూలై 27 : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరుతూ శనివారం విద్యార్థులతో కలిసి సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి నిధుల కేటాయింపు లేకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినా.. విద్యకు కనీసం 15శాతం నిధులు కూడా కేటాయించలేదని విమర్శించారు. విద్యారంగానికి చేసిన కేటాయింపులు సరిపోవని, తక్షణమే బడ్జెట్‌ను సవరించి కనీసం 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని, వెంటనే మంత్రిని ఏర్పాటు చేయాలని అన్నారు. 1400 మంది విద్యార్థులు చదువుతున్న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరిపడా తరగతి గదులు లేవని తెలిపారు. అదనపు తరగతి గదులను నిర్మించాలని, ప్రతి గ్రామానికీ బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థుల ఉన్నత విద్యకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టరేట్‌లోకి పోవడానికి ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో పోలీసులు, విద్యార్థులకు మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. కలెక్టరేట్ కార్యాలయ అధికారి సుదర్శన్‌రెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి వినతి పత్రం తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్, నాయకులు అక్కెనపల్లి వినయ్, విష్ణు, తన్వేశ్, శ్రవణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనల్లో రాణించాలి

● బయోటెక్నాలజీ గ్రాడ్యుయేషన్ డేలో ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి

బయోటెక్నాలజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డేలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి

రామగిరి, జూలై 27 : నేటి సమాజంలో బయోటెక్నాలజీ రంగానికి ఎంతో ఆదరణ ఉన్నదని, వర్సిటీలో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులంతా నూతన పరిశోధనల్లో రాణించాలని ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. వర్సిటీ సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ కళాశాలలోని సెమినార్ హాల్‌లో 2022-24 విద్యా సంవత్సరంలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులను అభినందించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బయోటెక్నాలజీ రంగం ఆవశ్యకత, ఆ రంగంలో వస్తున్న నూతన మెడిసిన్స్, ఇతర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, ప్లేస్‌మెంట్ అధికారి వై.ప్రశాంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శివరాం, మాధురి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.